


'ట్రిపుల్ తలాక్'
వివాహ వ్యవస్థకే ముప్పు

RNI NO:Title-Code:-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక
అనుక్షణం ప్రజల పక్షం...

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 1 సంచిక - 221 మంగళవారం 20 ఆగష్టు 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ప్రతి క్రీడకు ప్రాధాన్యం

దేశ క్రీడారంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ
స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకు ప్రాధాన్యం
క్రీడాకారులను గుర్తించి ప్రోత్సాహక శిక్షణ ఇవ్వాలి
యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ సిఎం రేవంత్ సమీక్ష




హైదరాబాద్, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
దేశ క్రీడారంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ యూనివర్సిటీపై ఆయన వారితో చర్చించారు. ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏవిధంగా ఉండాలనే దానిపై పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకు ప్రాధాన్యం ఉండాలని, అన్ని రకాల క్రీడలను, క్రీడా శిక్షణ సంస్థలను ఒకే గొడుగు కిందకు తేవడమే స్పోర్ట్స్ యూనివర్సిటీ లక్ష్యమన్నారు. మన దేశంతో పాటు తెలంగాణలోని భౌగోళిక పరిస్థితులు, మన శారీర నిర్మాణ తీరుకు అనువైన క్రీడలు ఏవో గుర్తించి, క్రీడలపై ఉత్సాహం ఉన్న వారిని గుర్తించి వారిని ఆయా క్రీడల్లో ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దశాబ్దాల క్రితమే ఆఫ్రో-ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్‌ను భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు వేదికగా మార్చాలని ముఖ్యమంత్రి అన్నారు.మిగతాది 2లో...

# మంకీ ఫాక్స్ అలెర్ట్



మంకీపాక్స్‌పై సచివాలయంలో
దామోదర రాజనర్సింహ సమీక్ష
అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచన
గాంధీ, ఫీవర్ ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలన్న మంత్రి
2లో.

# రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ సింఘ్వీ నామినేషన్


నామినేషన్ కార్యక్రమంలో
సీఎం, మంత్రులు,
ఎమ్మెల్సీలు, ఎంపీలు
సెప్టెంబర్ 3న తొమ్మిది
రాష్ట్రాల్లో 12 స్థానాలకు ఉప
ఎన్నిక



హైదరాబాద్, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ నుండి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన ఈ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ హాజరయ్యారు.రాజ్యసభలో తొమ్మిది రాష్ట్రాలకు చెందిన 12 స్థానాలకు సెప్టెంబర్ 3న ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులు పీయూష్ గోయల్, శరబానంద సోనోవాల్, జ్యోతిరాదిత్య సింధియా, కామాఖ్య ప్రసాద్, వివేక్ ఠాకూర్, రాజే భోస్లే, బిప్లబ్ కుమార్ దేవ్, మీసా భారతి, దీపేంద్రసింగ్ హుడా, కేసీ వేణుగోపాల్ లోక్ సభకు ఎన్నికయ్యారు. వీరు తమ రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి.ఒడిశాలో బీజేడీ ఎంపీ మమతా మొహంత పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణలో కే కేశవరావు బీఆర్ఎస్ పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో 12 స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు నామినేషన్ దాఖలుకు గడువు ఉంది.

# రుణమాఫీపై త్వరలో బీజేపీ ఆందోళనలు

రైతు బంధు విషయంలో ఘోరంగా విఫలం
కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్



కరీంనగర్, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
రుణమాఫీపై త్వరలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ అంటేనే మోసమని.. రైతు బంధు విషయంలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. రైతులు రైతుబంధు రాక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నాడు బీజేపీ కార్యాలయంలో బండి సంజయ్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ చేస్తే.. రైతులు రోడ్డు ఎందుకు ఎక్కుతున్నారని ప్రశ్నించారు. రుణమాఫీ చేయకుండా ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని అవమానించారని చెప్పారు. త్వరలో బీజేపీ ఆధ్వర్యంలో రుణమాఫీపై ఆందోళనలు చేపడతామని.. రైతులకు అండగా నిలుస్తామని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వస్తే.. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్‌లోకి వెళ్తారా అని ప్రశ్నించారు.వాళ్లకైనా ఏదో ఒక పార్టీ ఉందని.. మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏ పార్టీలు లేవని విమర్శలు చేశారు మిగతాది 2లో...

# ఇంతపెద్ద మొత్తంలో దేశంలో ఎక్కడా మాఫీ జరగలేదు




1.20 లక్షల రైతు ఖాతాల్లో జమకాని రుణమాఫీ
ఆధార్ తదితర వివరాలు సక్రమంగా లేక ఆలస్యం
వారందరికి త్వరలోనే రుణమాఫీ అమలు
మాఫీపై విపక్షాల విమర్శలు అత్యంత దారుణం
మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




# రూ.5వేల కోట్లతో 120 గురుకుల భవనాలు

స్థలాల ఎంపిక..డిజైన్లు పూర్తి చేయాలి
అధికారులతో సమీక్షలో డిప్యూటీ సిఎం భట్టి

# కుదిపేసిన కుండపోత



నిజామాబాద్ ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణపై కుండపోతగా వర్షం కురిసింది.పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది.గద్వాల జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మరోవైపు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనూ భారీ వర్షం కురిసింది. వర్షంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. నిజామాబాద్‌లోని రైల్వే బ్రిడ్జి వద్ద వరదలో ఆర్టీసీ బస్సు చిక్కుకుంది.బస్సులోకి నీరు చేరుతుండటంతో ప్రయాణీకులు ప్రాణభయంతో హాహాకారాలు చేశారు. పోలీసులు, స్థానికులు ప్రయాణికులను సురక్షితంగా బయటకు చేర్చారు. మరోవైపు బోధన్, ఆర్మూర్, బీర్కూర్, నవీపేట, ఇందల్‌వాయి, డిచ్‌పల్లి, సిరికొండ మండలాల్లో జోరు వాన కురిసింది. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా వర్షం కురువడం వల్ల ప్రధాన రహదారులపై నీరు చేరి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల డ్రైనేజీలు పొంగిపోవడంతో రహదారులపై వరద నీరు ప్రవహించింది.

**నిజామాబాద్‌లోని రైల్వే బ్రిడ్జి వద్ద వరదలో ఆర్టీసీ బస్సు**



# అక్కడ రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే మేం అధికారంలోకి వచ్చాక తొలగిస్తాం

: కేటీఆర్ హెచ్చరిక




సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం ఎందుకని నిలదీత
తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని డిమాండ్
వందలమంది ప్రాణాలు తీసిన నాయకుడి విగ్రహం పెడతారా? అని మండిపాటు

# ఇంతపెద్ద మొత్తంలో దేశంలో ఎక్కడా మాఫీ జరగలేదు

హైదరాబాద్, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
రాష్ట్రంలో జరిగిన రుణమాఫీ.. దేశంలో ఇంతవరకు ఎప్పుడూ జరగలేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రైతులను రుణవిముక్తులను చేయాలని తాము సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. సాంకేతిక కారణాల వల్ల కొందరికి రుణమాఫీ జరగలేదని, వారికి కూడా నూటికి నూరు శాతం రుణమాఫీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాజకీయ దురుద్దేశంతోనే విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నామని మండిపడ్డారు. ఎర్రమంజిల్‌లోని జలసౌధలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2014 తర్వాత భాజపా ఎప్పుడూ రుణమాఫీ గురించి మాట్లాడలేదన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న ఆ పార్టీ రైతుల కోసం ఎలాంటి మంచి పనులు చేయలేదని విమర్శించారు.



1.20 లక్షల రైతు ఖాతాలకు ఆధార్ నంబర్లు సరిగా లేవు. అందుకే వారికి రుణమాఫీ జరగలేదు. వాటిని సవరించడానికి ప్రక్రియ మొదలుపెట్టాం. ప్రతి మండలంలో మండల వ్యవసాయాధికారులకు బాధ్యతలు అప్పగించాం. వారు రుణమాఫీ కానీ రైతుల వివరాలను తీసుకొని పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే రుణమాఫీ చేస్తాం. కొన్ని ఖాతాల్లో వివరాలు సరిగా లేకపోవడం, రేషన్‌కార్డులు లేకపోవడం వల్ల రుణమాఫీ జరగలేదు. మండల వ్యవసాయాధికారులు ఈ సమస్యలను పరిష్కరిస్తారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు కచ్చితంగా ప్రభుత్వం రుణమాఫీ చేస్తుంది. ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని మంత్రి తెలిపారు. డిసెంబర్‌లో రుణమాఫీ చేస్తామని చెప్పి జూలైలోనే రుణమాఫీ మొదలు పెట్టామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని వారికి త్వరలో రుణమాఫీ చేస్తామన్నారు. లక్షా 20 వేల మంది రైతులు ఆధార్ నంబర్లు తప్పుగా ఇచ్చారని.. లక్షా 61 వేల రైతుల ఆధార్ కార్డుల్లో, అకౌంట్స్‌లో పేర్లు తప్పులు ఉన్నాయన్నారు. 4 లక్షల 83 వేల మందికి రేషన్ కార్డుల్లో తప్పులు ఉన్నాయని పేర్కొన్నారు. 8 లక్షల అకౌంట్స్ రెండు లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకున్నారని.. 2 లక్షల కంటే ఎక్కువ ఉన్న వారు పై అమౌంట్ కడితే వెంటనే రుణమాఫీ అవుతుందన్నారు. నాడు బీఆర్ఎస్ రుణమాఫీ టోటల్ ఫెయిల్యూర్ అని.. నాడు కేసీఆర్ చేసిన రుణమాఫీ రైతుల బ్యాంకు వడ్డీలకే సరిపోయిందని మంత్రి విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఒక తప్పుడు వాదనతో రైతుల్లో ఆందోళన కలుగజేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసినట్లుగా దేశంలో ఎక్కడా, ఎప్పుడు, ఏ రాష్ట్రం రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు. పార్లమెంట్‌లో వ్యవసాయం గురించి అనేక అంశాలపై మాట్లాడానని.. బీజేపీ రైతు రుణమాఫీ గురించి ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని.. రైతుల మేలు కోసం ఒక్క స్టెప్ కూడా బీజేపీ తీసుకోలేదని మండిపడ్డారు. మన్మోహన్ సింగ్ సర్కారు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తులను చేసిందన్నారు. తాము ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. పంద్రాగస్టు నాటికి రుణమాఫీ చేశామని.. మిగిలిన వారికి కూడా రుణమాఫీ చేస్తామన్నారు. పంట నష్టం జరిగితే రైతులకు బీఆర్ఎస్ ఒక్క పైసా ఇవ్వలేదని.. నాడు అనేక ఆందోళనలు చేశామని మంత్రి తెలిపారు. ఈ పంట నుంచి సన్నాలకు 500 రూపాయల బోనస్ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. రైతులకు పంట నష్టపరిహారం తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇస్తున్నామని వెల్లడించారు.

బీఆర్ఎస్ రైతులను మోసం చేసిందని. రైతుల జీవితాలను నాశనం చేసిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు తీసుకున్న రుణం వడ్డీ మొత్తం మేము మాఫీ చేశామన్నారు. గతంలో ప్రజల ఆస్తి

ఓఆర్ఆర్‌ను అమ్మి రుణమాఫీ చేశారని మంత్రి పేర్కొన్నారు. 2018లో రైతు రుణమాఫీలో అనేక ఫిర్యాదులు వస్తే వాటి పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన వెల్లడించారు. రైతులను మోసం చేయడం బీఆర్ఎస్‌కు అలవాటు అని.. అధికారంలో ఉన్నా లేకపోయినా బీఆర్ఎస్‌కు ఇది అలవాటేనంటూ ధ్వజమెత్తారు. రెండు లక్షల కంటే ఎక్కువగా రుణం ఉన్న వారు వెంటనే పైన డబ్బులు బ్యాంకులకు చెల్లిస్తే రుణమాఫీ అవుతుందన్నారు. మోసపూరిత బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మవద్దంటూ వ్యాఖ్యానించారు. రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. రుణమాఫీ విషయంలో బీజేపీ కుట్రలు చేస్తోందన్నారు. ఈ సారి నుంచి సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

## రూ.5వేల కోట్లతో 120 గురుకుల భవనాలు



హైదరాబాద్, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ వ్యాప్తంగా ఈ ఏడాది రూ.5వేల కోట్లతో 30 ప్రాంతాల్లో 120 గురుకుల పాఠశాల భవనాలు నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సమీకృత గురుకుల సముదాయాల కోసం నియోజకవర్గాల్లో స్థలాలు, డిజైన్ల ఎంపిక వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. గురుకులాల ఏర్పాటుకు గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 25 ఎకరాలు, పట్టణాల్లో 10 నుంచి 15 ఎకరాల భూమి సేకరించాలన్నారు. గురుకులాల్లో అవసరమైన సదుపాయాలపై ఈ నెల 29లోగా నివేదిక సమర్పించాలని విద్యాశాఖను ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ వినతిపై డిప్యూటీ సీఎం భట్టి సానుకూలంగా స్పందించారు. పెండింగులో స్కాలర్‌షిప్ బకాయిల జాబితా ఇవ్వాలని అధికారులకు తెలిపారు. నిర్ణీత గడువులోగా ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయించుకునే బాధ్యత అధికారులదేనని చెప్పారు.

## ప్రతి క్రీడకు ప్రాధాన్యం

(మొదటి పేజి తరువాయి)
హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడలో మన క్రీడాకారులు పతకాలు దక్కేలా వారిని తీర్చి దిద్దాలని, అందులో మన స్పోర్ట్స్ యూనివర్సిటీ క్రీడాకారులు కచ్చితంగా ఉండాల్సిదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం వారికి నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇప్పించాలన్నారు. ూష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని క్రీడా విభాగాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలలు, అకాడమీలు, క్రీడా శిక్షణ సంస్థలు అన్నింటిని స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో మన దేశ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో రాణించే షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, అర్చరీ, జావెలిన్ త్రో, హాకీకి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత శిక్షణ ద్వారా పతకాలు సాధించే అవకాశాలు ఉన్న క్రీడల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. యూనివర్సిటీలో ఆయా క్రీడల్లో శిక్షణకు అవసరమైన వసతులు, ఆహారంతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ూన్నతనంలోనే విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలు, వారికి ఏ క్రీడలపై మక్కువ ఉందో ఉపాధ్యాయలు గుర్తించాలని ముఖ్యమంత్రి సూచించారు. అటువంటి విద్యార్థులందరికీ ఆయా క్రీడల్లో శిక్షణ ఇచ్చేలా ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఒక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ పాఠశాలల్లో విద్యా బోధనతో ఉంటుందని అయితే క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని, విద్యార్థులకు అక్కడ వారికి నచ్చిన క్రీడల్లో శిక్షణ ఇచ్చి, ప్రతిభ ఆధారంగా వారికి స్పోర్ట్స్ యూనివర్సిటీలో వసతి కల్పించి మరింత పదును తేలేలా శిక్షణ ఇప్పించాలన్నారు.. హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశా క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా ఉండాలని, అందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇటీవల ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన దేశాలు, క్రీడాకారుల వివరాలను సేకరించి, ఆయా క్రీడాకారులు పతకాల సాధనకు శ్రమించిన తీరు, ఆయా దేశాలు వారిని ప్రోత్సహించిన తీరు, వారికి ఇచ్చిన శిక్షణ, ప్రోత్సాహం తదితరాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇప్పటికే
స్కిల్ యూనివర్సిటీకి యంగ్ ఇండియా పేరు పెట్టామని, స్పోర్ట్స్ యూనివర్సిటీ యంగ్ ఇండియా పేరు ఖరారు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు యంగ్ ఇండియా పేరు పెడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ యంగ్ ఇండియాకు బ్రాండ్‌గా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యాల్లో తెలంగాణ ఒక శక్తిమంతమైన రాష్ట్రంగా గుర్తింపు పొందడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# అక్కడ రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే మేం అధికారంలోకి వచ్చాక తొలగిస్తాం

### : కేటీఆర్ హెచ్చరిక

హైదరాబాద్, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే... తాము అధికారంలోకి వచ్చాక దానిని తొలగించి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటేలా సచివాలయాన్ని కడితే కాంగ్రెస్ ప్రభుత్వం దాని ఎదుట రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడమేమిటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.
సోమవారం ఆయన బీఆర్ఎస్ భవన్‌లో రాఖీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడమేమిటని నిలదీశారు. రాజకీయాల్లో అధికారం, పదవులు శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు, రాజీవ్‌కు ఏం సంబంధం ఉందో చెప్పాలని నిలదీశారు. వందలమంది ప్రాణాలు తీసిన నాయకుడి విగ్రహం పెడతారా? అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.
తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్ విగ్రహం ఏర్పాటు దారుణమన్నారు. రాష్ట్రంలో రాజీవ్ పేరుతో ఉన్న రింగ్ రోడ్డు, హైదరాబాద్ విమానాశ్రయం సహా ఇతర సంస్థల పేర్లను సైతం మారుస్తామని హెచ్చరించారు. తెలంగాణలో ఇందిరాగాంధీ, రాజీవ్ పేర్లతో హైదరాబాద్‌లో చాలానే ఉన్నాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఇప్పటికైనా మారకుంటే అధికారంలోకి వచ్చాక తాము మారుస్తామన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ మనసు మార్చుకుని సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. రాజీవ్ విగ్రహాన్ని గాంధీ భవన్‌లో లేదా రేవంత్ రెడ్డి తన ఇంట్లో పెట్టుకోవచ్చని ఎద్దేవా చేశారు.

## రుణమాఫీపై త్వరలో బీజేపీ ఆందోళనలు

(మొదటి పేజి తరువాయి)
కేటీఆర్ బతుకు ఎటూ కాకుండా పోతుందని ఎద్దేవా చేశారు. బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ అవసరం లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల అవసరం కాంగ్రెస్‌కే ఉందని.. అందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటుందని ఆరోపణలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ సిద్ధాంతాలు ఒక్కటేనని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో భుజంగరావుకు బెయిల్

### మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన కోర్టు

హైదరాబాద్, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ2గా ఉన్న మాజీ అదనపు ఎస్పీ భుజంగరావుకు నాంపల్లి కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనారోగ్యం కారణంగా తనకు బెయిల్ మంజూరు చేయాలని భుజంగరావు వేసిన పిటిషన్ ను విచారించిన ధర్మాసనం 15 రోజుల పాటు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాలు లేకుండా హైదరాబాద్ వదిలి వెళ్లరాదని ఆదేశించింది. కాగా, తెలంగాణలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావును పోలీసులు మార్చి 23న అరెస్టు చేశారు. బెయిల్ కోసం పలుమార్లు అభ్యర్థించగా.. ఆ పిటిషన్లను కోర్టు తిరస్కరించింది. ఇటీవల భుజంగరావుకు గుండె సంబంధిత సమస్య కారణంగా బెయిల్ మంజూరైంది. ఈ కేసులో తొలుత మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును అరెస్టు చేశారు. ఆయన ఇచ్చిన సమాచారం మేరకు పంజాగుట్ట పోలీసులు అదనపు ఎస్పీలు తిరుపతన్న, భుజంగరావులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి ఏ1 ప్రభాకర్ రావు అమెరికాలో ఉండగా.. తాజాగా ఆయనకు రెడ్ కార్నర్ నోటీసులు కూడా జారీ చేశారు.

# మంకీ ఫాక్స్ అలెర్ట్

హైదరాబాద్, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంకీ పాక్స్‌పై వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఢిల్లీ, చెన్నైలలో మంకీ పాక్స్ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన అధికారులతో ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. తెలంగాణలో ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదని అధికారులు... మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు.
వివిధ రాష్ట్రాల నుంచి చాలామంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. తరచూ ప్రయాణాలు చేసేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ టెస్ట్ చేయాలని సూచించారు.
అవసరమైన మెడికల్ కిట్స్, మందులను అందుబాటులో ఉంచాలని వైద్య అధికారులకు సూచించారు. గాంధీ ఆసుపత్రి, ఫీవర్ ఆసుపత్రులలో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

## తల్లి ఆత్మహత్యతో అనాథగా బాలిక

### ఆసరాగా ఉంటామని ప్రకటించిన సిఎం రేవంత్

### లక్ష రూపాయాల తక్షణ సాయం అందించిన మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్,ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):ఆ చిన్నారి కష్టం పగవాడికి కూడా రాకూడదు. అప్పటి వరకు తల్లిచాటు బిడ్డగా ఎదిగిన ఆ చిన్నారికి ఒక్కసారిగా లోకం చీకటిగా మారిపోయింది. ఉన్న ఒక్క బంధం కూడా తెగిపోవడంతో ఒంటరిగా మిగిలిపోయింది. కన్న తల్లి చనిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న 11 ఏళ్ల బాలికకు



స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'నేనున్నానంటూ' బాసటగా నిలిచారు. బాలికకు అన్ని విధాలుగా అండగా నిలవాలని కలెక్టర్‌కు సీఎం ఆదేశాలు జారీ చేశారు. తల్లి ఆత్మహత్యతో ఒంటరిగా మిగిలిపోయిన బాలిక దుర్గకు అన్ని విధాలా అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లా తానూర్ మండలం బేల్‌తరోడా గ్రామానికి చెందిన ఒంటరి మహిళ మేర గంగామణి (36) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆమె ఏకైక కుమార్తె దుర్గ (11) అనాథగా మిగిలింది. తల్లి అంత్యక్రియలకు డబ్బులేకపోవడంతో దుర్గ భిక్షాటన చేసింది. విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. బాలికకు విద్యా,వైద్య, ఇతర అవసరాలకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ అభినవ్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం రేవంత్ ఆదేశాల మేరకు బాలికకు ఉచిత విద్య అందించేందుకు గురుకుల పాఠశాలలో చేర్పుతామని కలెక్టర్ వెల్లడించారు. వైద్యం, ఇతర సమస్యలేమైనా ఉంటే వాటిని వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.మరోవైపు విషయం తెలుసుకున్న మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. తానున్నానంటూ భరోసా కల్పించారు. ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా లక్ష రూపాయలను తహసీల్దార్ లింగమూర్తి, ఎంపిడివో అబ్దుల్ సమాద్ ద్వారా బాలికకు అందించారు. ఆర్థిక చేయూతను అందించి చిన్నారికి విద్యపరంగా ఉచితంగా అన్ని సౌకర్యాలు కల్పించి పెళ్ళి అయ్యేవరకు బాధ్యత వహిస్తానని హామీ ఇచ్చారు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఖర్చులకు ప్రతి నెల డబ్బు పంపుతానని చెప్పారు. ఉండడానికి ఇల్లు కూడా సమకూరుస్తామని వెల్లడించారు. ఈ మేరకు పాపతో మంత్రి కోమటి రెడ్డి విడియో కాల్ చేసి మాట్లాడి ధైర్యం చెప్పారు. అధర్య పడవద్దు,తాను ఉన్నానని భరోసా కల్పించారు. త్వరలో పాపను కలుస్తానని చెప్పారు

# ఆర్టీసీ బస్సులో ప్రసవం

### ఆశా కార్యకర్త సాయంతో కాన్పు చేసిన కండక్టర్

### అభినందించిన మంత్రి పొన్నం.. ఆర్టీసీ ఎండి



రాజోలి ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ గర్భిణి.. బస్సులోనే బిడ్డకు జన్మనిచ్చింది. గద్వాల నుంచి వనపర్తికి వెళ్లే పల్లె వెలుగు బస్సులో గద్వాల మండలం కొండపల్లి గ్రామానికి చెందిన సంధ్య తన భర్తతో కలిసి వెళ్తోంది. వనపర్తికి 15 కిలోమీటర్ల దూరంలోని నాసినల్లి గ్రామం వద్ద మహిళకు పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో మహిళా కండక్టర్ భారతి స్పందించి, బస్సులో ఉన్న ఆశా కార్యకర్త సహకారంతో బస్సు నిలిపివేసి కాన్పు చేయగా.. ఆడశిశువు జన్మించింది. అనంతరం 108 వాహనంలో తల్లీబిడ్డను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. బస్సు కండక్టర్‌ను అభినందించారు. కండక్టర్ సమయస్ఫూర్తి వల్లే తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని కొనియాడారు. అలాగే ఆర్టీసీ ఎండి సజ్జానార్ కూడా భారతిని అభినందించారు..

# స్వీకరించిన అర్జీలను శీఘ్రగతిన పరిష్కరించాలి

## - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



వరంగల్ బ్యూరో, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త): ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను శీఘ్రగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు సమర్పించిన వినతులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి డిఆర్డిఓ కౌసల్యాదేవి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆర్డీఓ కృష్ణవేణిలతో కలిసి స్వీకరించారు. అనంతరం రాఖీ పౌర్ణమి సందర్భంగా నేటి ప్రజావాణి కార్యక్రమంలో 19 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను, సంబంధిత శాఖల అధికారులకు సిఫారసు చేస్తూ, మానవతా దృక్పథంతో త్వరితంగా పరిష్కరించాలని సూచించారు. పరిష్కరించుటకు వీలులేని పక్షంలో దరఖాస్తు దారుడికి అర్థమయ్యే విధంగా వివరించి, అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియచేయాలని కలెక్టర్ అన్నారు. ప్రజావాణిలో దరఖాస్తులు మొత్తం 19 రాగా అందులో 7 వినతులు రెవెన్యూ సమస్యలకు, మిగిలిన వివిధ శాఖలకు సంబంధించిన వినతులు వచ్చాయని వివరించారు. ప్రతి వారం నిర్వహించే ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను ప్రజావాణి పోర్టల్ ద్వారా ఆన్లైన్ లో సంబంధిత శాఖల జిల్లా అధికారులకు పంపించడం జరుగుతున్నదని తెలిపారు. వాటిని పెండింగులో ఉండకుండా సకాలంలో పరిష్కరించాలని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# పేకాట రాయుళ్ళ పట్టివేత

వర్ధన్నపేట, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామ శివారులో కొందరు పేకాటరాయుళ్లను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. గత కొంతకాలంగా పేకాట ఆడుతున్నారని స్థానికుల సమాచారం ప్రకారం వర్ధన్నపేట పోలీస్ యంత్రాంగం కొత్తపల్లి గ్రామంలోని కల్లుమండవా సమీపంలో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఐదుగుర పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 10170 రూపాయలు, రెండు సెల్ ఫోన్లు, ఆటలో ఉపయోగించిన పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. వారి వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

## - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



వరంగల్ బ్యూరో, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లాలో పారదర్శకంగా ఓటరు జాబితా 2025 రూపొందించుటకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమైనారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి మాట్లాడుతూ
జనవరి 1, 2025 ప్రామాణికంగా ఓటర్ జాబితా సవరణ 2025 కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పించేలా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని తెలిపారు.
ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించి, అక్టోబర్ 29న, ముసాయదా ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వివరించారు. నవంబర్ 28, 2024 వరకు సదరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి, రెండు శనివారాలు, ఆదివారాలు ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 24, 2024 లోగా అభ్యంతరాలను, ఓటర్ క్లెయిమ్స్ ను పూర్తి స్థాయిలో పరిష్కరించి, జనవరి 6, 2025న, తుది ఓటరు జాబితాను రుపోందించడం జరుగుతుందన్నారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18, 2024 వరకు బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వారిగా ఇంటింటికి తిరుగుతూ ఓటరు ధృవీకరణ చేపట్టాలని, ఓటరు జాబితాలో అవసరమైన చోట పాత ఫోటోలను తొలగించి ఓటర్ల నూతన ఫోటోలు అప్లోడ్ చేస్తారని, జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని అన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న లాజికల్ పొరపాట్లు, డెమో గ్రాఫికల్ పొరపాట్లను పూర్తి స్థాయిలో సవరిస్తున్నట్లు ఆదేశించారు. మరణించిన ఓటర్ల వివరాలను, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను ఓటర్ జాబితా నుంచి ఫారం 7 ద్వారా తొలగిస్తామని అన్నారు. 1500 మంది ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేసి అవసరమైన చోట నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పిస్తామని అన్నారు.
ఓటర్ జాబితాలో ఉన్న మల్టీ ఎంట్రీలను తొలగించాలని, అదేవిధంగా ఓటర్ కార్డుపై ఉన్న పొరపాట్లు పరిష్కరించుటకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఐఎన్ సి నుండి ఇవి శ్రీనివాస్ రావు, నిహాల్, బిజెపి నుండి హరి శంకర్, ఏఐఎంఐఎం నుండి ఫైజ్ ఉల్లాహ్, టిడిపి నుండి శ్యామ్ వైయస్సార్సీపి నుండి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కొనాయిమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ ట్రయల్ రన్ కు చర్యలు

## - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



వరంగల్ బ్యూరో, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
కొనైమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ ట్రయల్ రన్ కు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొనైమాకుల గ్రామంలో 14 వేల ఆయకట్టుకు, సాగునీరు అందించుటకు రూపొందించి, నిర్మించిన కునైమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ ను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లిఫ్ట్ ఇరిగేషన్ లో పంపులు, మోటార్లు బిగించారు. మిగిలిన విద్యుత్ సబ్స్టేషన్, ట్రాన్స్ఫార్మర్ తదితర ఏర్పాట్లు చేసుకొని, త్వరితగతిన ట్రయల్ రన్ చేయుటకు చర్యలు తీసుకోవాలని అన్నారు. భూసేకరణను త్వరగా చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను కోరారు. కలెక్టర్ వెంట ఎస్సారెస్పీ డిఈ రామకృష్ణ ఏఈ కిరణ్మయి తదితరులు ఉన్నారు.

## బిజెపి జిల్లా ప్రచార కార్యదర్శిగా

# వడ్లకొండ రవి గౌడ్



రాయపర్తి, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త): భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రచార కార్యదర్శిగా రాయపర్తి మండలం కొండూరు గ్రామానికి చెందిన వడ్లకొండ రవి గౌడ్ నియమితులైనట్లు సోమవారం వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వడ్లకొండ రవి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేస్తూ, క్యాడర్ తయారు చేస్తూ, పార్టీ ముందుకు తీసుకెళ్తానని అన్నారు. కేంద్రంలో బిజెపి నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి, ప్రజలను చైతన్య పరుస్తానని అన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తూ, పార్టీ సిద్ధాంత కర్తలు శ్యాంప్రసాద్, ముఖర్జీ దీన్ దయాల్, ఉపాధ్యాయులు అటల్ బీహార్ వాజ్పయ్ చెప్పిన ఏకాత్మక మానవత వాదం, అంత్యోదయ సిద్ధాంతం దేశంలో నివసిస్తున్న చిట్ట చివరి వ్యక్తికి ఫలాలు అందాలనేదే భారతీయ జనతా పార్టీ సిద్ధాంతం అన్నారు. ప్రజల కోసం పని చేస్తూ, పార్టీని ముందుకు తీసుకెళ్తానని చెప్పారు. భారతీయ జనతా పార్టీ కార్యకర్తలను సైనికుల వలె తయారు చేస్తానని పేర్కొన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన బిజెపి జిల్లా అధ్యక్షులు గంటా రవి కుమార్, కార్యవర్గ సభ్యులు లేగా రామ్మోహన్ రెడ్డి, సహకరించిన వరంగల్ జిల్లా మండల నాయకులు, కార్యకర్తలు, బిజెపి పార్టీ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



రాయపర్తి, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల కేంద్రంలో ఫోటో, వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫోటో గ్రాఫి పితామహులు లూయిస్ డాగురే చిత్రపటానికి మండల అధ్యక్షులు పోగులకొండ అశోక్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరిగి పోయో కాలంలో ఎప్పటికీ నిలిచిపోయే జ్ఞాపకమే ఫోటోగా అందించిన మహనీయులు ఫోటోగ్రఫీ పితమహులు లూయిస్ డాగురేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బూర్గు నవీన్ గౌడ్, ఆకారుపు విష్ణు, మొరపోజు రాజశేఖర్, గాజుల రాజు, పాము భరత్, గోరంట్ల ప్రభాకర్, గజవెల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మండల బీజేపీ అధ్యక్షునిగా

# నూనె అనిల్ యాదవ్



రాయపర్తి, ఆగస్టు 19,(జర్న లిస్ట్ వార్త): భారతీయ జనతా పార్టీ రాయపర్తి మండల నూతన అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన నూనె అనిల్ యాదవ్ సోమవారం నియమకమయ్యారు. ఈ సందర్భంగా నూనె అనిల్ యాదవ్ మాట్లాడుతు తాను గతంలో ఏబీవీపీలో మండల స్థాయి, రాష్ట్ర స్థాయి వరకు అనేక బాధ్యతలు నిర్వర్తించి, 5 సంవత్సరాలు పూర్తి సమయం కార్యకర్తగా, విద్యార్థులను సంఘటీతం చేస్తూ, విద్యార్థుల సమస్యల పై పోఈరాటం చేయడం జరిగిందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పోరాటం చేసి, రాష్ట్ర సాధనలో భాగస్వామ్యం కావడం జరిగిందన్నారు. భారతీయ జనతా యువజన విభాగంలో వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యలు చేయడం జరిగిందన్నారు. పార్టీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటూ, కేంద్ర ప్రభుత్వ పథకాలనుపై ప్రజల్ని చేతన్యం పరుస్తూ, ఎప్పటికి కప్పుడు రాష్ట్ర ప్రభుత్వ పని తీరును ఎండగడుతూ, పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని, నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్, సహకరించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కర్ర శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్, జిల్లా నాయకులు గడ్డం నరేందర్, మండల బీజేపీ సీనియర్ నాయకులకు, బీజేవైఎం నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల మండిపాటు

హైదరాబాద్,ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి, తెలంగాణకు ఏం సంబంధం అంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది.
జలసౌధలో జరిగిన సమావేశం సందర్భంగా 'భారాస అధికారంలోకి రాగానే రాజీవ్‌గాంధీ విగ్రహం తొలగించి తెలంగాణ తల్లి విగ్రహం పెడతామని' భారాస నేతలు చేసిన వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించగా.. భారాస తిరిగి అధికారంలోకి వచ్చేది లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జలసౌధ దగ్గర విలేకరులతో మాట్లాడుతూ.. కేటీఆర్‌కు రాజీవ్‌గాంధీ పేరు పలికే స్థాయి లేదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం రూపకల్పన జరుగుతోందని, త్వరలోనే సచివాలయం లోపల ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎంపీ మల్లు రవి, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజన్‌కుమార్‌యాదవ్, సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్‌లు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో కేటీఆర్ వ్యాఖ్యలను ఆక్షేపించారు.

# రాయపర్తి ఎస్సై బాధ్యతలు చేపట్టిన శ్రవణ్ కుమార్



రాయపర్తి, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల ఎస్సైగా కె. శ్రవణ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు మునుపు ఎస్సై బాధ్యతలు నిర్వర్తించిన ఎస్సై సందీప్ బదిలీపై విఆర్ వెళ్లారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది వారికి స్వాగతం పలికారు.

# శ్రీసిటీలో సంపద సృష్టి

**శ్రీసిటీలో 220 కంపెనీల ఏర్పాటుకు అవకాశం**
**4.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు**
**4 బిలియన్ డాలర్ల ఎగుమతులు సాధించడం గొప్ప**
**ఉపాధి, సంపద సృష్టిస్తున్న పారిశ్రామికవేత్తలు**
**బిజినెస్ సెంటర్‌లో పలు కంపెనీల సీఈవోలతో చంద్రబాబు భేటీ**




చిత్తూరు,ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
శ్రీసిటీలో 220 కంపెనీల ఏర్పాటుకు ఇక్కడ అవకాశం ఉందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఒకేచోట 30 కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యాం. ఆటోమేటివ్, ఎలక్ట్రానిక్స్, ఎఫ్ఎంసీజీ పరిశ్రమలు వచ్చాయి. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటయ్యాయి. 4.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 4 బిలియన్ డాలర్ల ఎగుమతులు సాధించడం చాలా గొప్ప విషయం అని చంద్రబాబు తెలిపారు. పారిశ్రామికవేత్తలు ఉపాధి, సంపద సృష్టిస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌లో పలు కంపెనీల సీఈవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, ఈ సంపద సంక్షేమానికి దోహదం చేస్తుందని చెప్పారు.

1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాయి. పెట్టుబడులు రాబట్టేందుకు పలు దేశాల్లో పర్యటించాను. భారత్‌ను ఐటీ.. ప్రపంచ పటంలో నిలుపుతుందని ఆనాడే చెప్పాను. గతంలో పీపీపీ విధానంలో హైటెక్ సిటీ చేపట్టాను. ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా భారతీయులు కనిపిస్తారు. ప్రపంచంలో ప్రతి నలుగురు ఐటీ నిపుణుల్లో ఒక భారతీయుడు ఉంటారు. ఇందులోని ప్రతి నలుగురిలో ఒక ఏపీ వ్యక్తి ఉంటారు. శ్రీసిటీలో 8 వేల ఎకరాల్లో పారిశ్రామిక జోన్లు ఏర్పాటయ్యాయి. సెజ్, డొమెస్టిక్ జోన్, ఫ్రీట్రేడ్ జోన్‌లు వచ్చాయి. చెన్నై, కృష్ణపట్నం, తిరుపతి ప్రాంతాలకు శ్రీసిటీ దగ్గరగా ఉందని చంద్రబాబు అన్నారు. శ్రీసిటీని అత్యుత్తమ ఎకనమిక్ జోన్‌గా తయారు చేయాలనేది తన ఆలోచనని చెప్పారు. '

# 'ట్రిపుల్ తలాక్' వివాహ వ్యవస్థకే ముప్పు

**దీంతో ముస్లిం మహిళల పరిస్థితి దయనీయం**
**సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం**




న్యూఢిల్లీ, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
ట్రిపుల్ తలాక్ విధానం వివాహ వ్యవస్థకే పెనుముప్పు అని, దీనివల్ల ముస్లిం మహిళల పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతుందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. 2017లో సుప్రీంకోర్టు ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేసినప్పటికీ.. ఆ విధానానికి అడ్డుకట్ట పడలేదని కేంద్రం అఫిడవిట్‌లో తెలిపింది. ట్రిపుల్ తలాక్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో దాన్ని ఇంకా నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని, ముస్లిం మహిళల వివాహ హక్కుల రక్షణ చట్టం 2019 రాజ్యాంగ విరుద్ధమంటూ ప్రముఖ సున్నీ పండితుల సంఘంగా అభివర్ణించుకున్న 'సమస్థ కేరళ జమైతుల్ ఉలేమా' పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ అఫిడవిట్‌ను దాఖలు చేసింది.
ఈ చట్టం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు కిందకు వస్తుందని పిటిషనర్లు వాదించగా.. దాన్ని కేంద్రం వ్యతిరేకించింది. ట్రిపుల్ తలాక్ విధానమే ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్లని, రాజ్యాంగం మహిళలకు కల్పించిన సమానత్వపు హక్కును కాలరాసినట్లు అవుతోందని తెలిపింది. ముస్లిం మహిళల హక్కులను కాపాడేందుకే చట్టాన్ని చేసినట్లు వివరించింది.

# కెటిఆర్‌తో శ్రీలంక మంత్రి భేటీ



హైదరాబాద్, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ని శ్రీలంక మంత్రి సదాశివం వియలేంద్రన్ ఆయన నివాసంలో కలిశారు. బిఆర్ఎస్ సర్కార్ హయాంలో రాష్ట్రాభివృద్ధిపై కెటిఆర్‌ను ఆయన అభినందించారు. బిఆర్ఎస్ పనితీరు తమకు స్ఫూర్తిగా నిలిచిందని సదాశివం అన్నారు. 'మీ పాలన మాకు ఆదర్శం. బిఆర్ఎస్ పదేళ్లలో అనూహ్య ప్రగతి సాధించింది. గతంలో శ్రీలంక పార్లమెంట్‌లోనూ ఈ విషయాన్ని నేను ప్రస్తావించా. హైదరాబాద్ అభివృద్ధి సింగపూర్‌ను తలపించేలా ఉంది. మాజీ సిఎం కేసీఆర్, కెటిఆర్ తెలంగాణను పెట్టుబడులకు కేరాఫ్‌గా మార్చారు. ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పెరుగుతుంటే, రాష్ట్రాన్ని అవకాశాల అక్షయపాత్రగా మార్చిన మీ తీరు మాకు స్ఫూర్తిదాయకం' అని సదాశివం వెల్లడించారు.
సదాశివంతో సమావేశం అనంతరం కెటిఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయన మాటలు బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం చేసిన పనులను గుర్తు చేశాయన్నారు. 'తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిపై ఆయన నాతో సుదీర్ఘంగా చర్చించారు. పదేళ్ల అత్యల్ప కాలంలో రాష్ట్రం ఇంతగా పురోగమించడంపై గర్వంగా ఉంది. హైదరాబాద్‌ను అవకాశాల హబ్‌గా మార్చడంలో మా కృషిని గుర్తించినందుకు మంత్రి సదాశివంకు కృతజ్ఞతలు. దశాబ్ద కాలంలో బిఆర్ఎస్ పాలన ఎంత అంకితభావంతో సాగిందో మంత్రి సదాశివం నాతో పంచుకున్నారు. బిఆర్ఎస్ సంపద సృష్టించడమే కాకుండా, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలను ఆదుకున్న విషయాన్ని నేను ఆయనకి వివరించా'అని కెటిఆర్ తన పోస్ట్‌లో వెల్లడి చేశారు.

# కలుషితాహారం తిని విద్యార్థుల మృతి

**-వివిధ ఆస్పత్రుల్లో మరో 17మందికి చికిత్స - విచారణకు ఆదేశించిన సిఎం చంద్రబాబు**



అనకాపల్లి, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
కలుషితాహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో నలుగురు మృతి చెందారు. రెండు రోజుల క్రితం అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాస పట్టణంలోని అనాథాశ్రమంలో సమోసా తిని 27 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో సోమవారం నలుగురు మృతి చెందారు. మృతి చెందిన విద్యార్థులను జాషువా, భవాని, శ్రద్ధ, నిత్యగా గుర్తించారు. మిగతా 23 మందికి నర్సీపట్నం, అనకాపల్లి ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఏడుగురు, అనకాపల్లి ఏరియా ఆసుపత్రిలో 17 మంది విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. ఘటనపై డీఈవో అప్పారావు విచారణ చేపట్టారు. అనకాపల్లిలోని అనాథాశ్రమంలో చుట్టపక్కల ఉన్న చిన్నారు చదువు కుంటుంటారు. ఈ క్రమంలో ఆదివారం కలుషిత ఆహారం తిని నలుగురు మృత్యువాతపడగా.. దాదాపు 27 మంది అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం మధ్యాహ్నం ఆహారంతో పాటు సమోసాలను చిన్నారులు తిన్నారు. ఆ వెంటనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు వాంతులు చేసుకోవడంతో వెంటనే ఆశ్రమ నిర్వాహకుడు వాళ్లను ఇంటికి పంపించి వేశారు. ఇంటికి వెళ్లిన వెంటనే నలుగురు చిన్నారుల పరిస్థితి విషమంగా మారింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ వారు మృతిచెందారు. మిగిలిన విద్యార్థులు నర్సీపట్నం, అనకాపల్లి ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అస్వస్థతకు గురైన ఇతర విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఘటనకు గల కారణాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ఈ ఘటన తనను కలచి వేసిందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు జిల్లా కలెక్టర్లతో మాట్లాడినట్లు వెల్లడించారు. అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 17 మంది విద్యార్థులకు సరైన వైద్యం అందిచాలని అధికారులను ఆదేశించానన్నారు.కైలాసపట్నం ఫుడ్ పాయిజన్ కేసుపై హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. విద్యార్థుల మృతిపై తీవ్ర దిగ్భాం÷-రతి వ్యక్తం చేసిన ఆమె... అనకాపల్లి జిల్లా కలెక్టర్, కేజీహెచ్, నర్సీపట్నం ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లతో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అధికారులను అప్రమత్తం చేసిన హోం మంత్రి వంగలపూడి అనిత. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటీ డిఈఓ పెన్నాడ అప్పారావు, ఎంఈఓ పి రామారావుసహా పోలీసులు అధికారులు ఈ దుర్ఘటపై దర్యాప్తు చేస్తున్నారు.

# ముఖ్యమంత్రికి రాఖీ కట్టిన చిన్నారులు.



హైదరాబాద్, ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
వినికిడి సమస్యతో బాధపడుతూ ప్రభుత్వ సహాయంతో శస్త్రచికిత్స చేయించుకున్న పలువురు చిన్నారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోమవారం రాఖీలు కట్టి తమ అభిమానం చాటుకున్నారు. వినికిడి సమస్య ఉన్న అయిదేళ్లలోపు పిల్లలకు సర్జరీలు చేస్తే సమస్య పరిష్కారమవుతుంది. కాగా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత వినికిడి సమస్యతో బాధపడుతున్న చిన్నారుల వైద్యానికి అవసరమైన సహాయాన్ని వేగంగా అందిస్తున్నారు. దీంతో హైదరాబాద్ కోటిలోని ఈఎన్‌టీ హాస్పిటల్‌లో కోక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు ఇటీవల పెద్ద సంఖ్యలో జరగుతున్నాయి. ఖరీదైన వినికిడి యంత్రాలు, సర్జరీలు చేయించుకున్నవారికి ఎల్‌వోసీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం అండగా నిలిస్తుంది. చికిత్సల అనంతరం ఉచితంగా వినికిడి యంత్రాలతో పాటు ఏడాది పాటు ఏవీటీఋఅడిషన్ వర్బల్ థెరపీ) అందిస్తారు. ఇటీవల ఈ సర్జరీలు చేయించుకున్న పలువురు చిన్నారులు ఇఎన్‌టి హస్పిటల్ సూపరింటెండెంట్ ఆనంద్ ఆచార్య, వైద్యురాలు డీకే వీణ ఆధ్వర్యంలో సోమవారం సచివాలయానికి వొచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమ పిల్లలకు శస్త్రచికిత్సలు చేయించినందుకు వారి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# బాధ్యతతో.. ఉపాధి కల్పన


**పంచాయతీరాజ్ శాఖపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష**
**రాష్ట్ర సచివాలయం నుంచి పవన్ కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్**
**హాజరైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు**



అమరావతి,ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త):
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇవాళ రాష్ట్ర సచివాలయంలో పంచాయతీరాజ్ శాఖపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, 26 జిల్లాల జడ్పీ సీఈవోలు, డీపీవోలు, డ్వామా పీడీలు, ఎంపీడీవోలు, ఈవో పీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఏపీవోలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనుల ఆమోదం కోసం గ్రామ సభ నిర్వహణ, అందుకు సంబంధించిన విధి విధానాలపై పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ నెల 23న రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పరిధిలో 46 రకాల పనులు చేపట్టవచ్చని అన్నారు. ఈ పథకం ద్వారా వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నామని, ప్రతి రూపాయిని బాధ్యతతో ఖర్చుపెట్టాలని, ఉపాధి హామీ పథకం లక్ష్యం అందుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా స్థాయి అధికారుల నుంచి, మండల, గ్రామ స్థాయిలో ఉన్న అధికారుల వరకు ఈ పథకం అమలులో బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సోషల్ ఆడిట్ విభాగం పకడ్బందీగా వ్యవహరించాలని తెలిపారు.

# ఫైబర్‌నెట్ మాజీ ఎండీ మధుసూదన్ రెడ్డి సస్పెన్షన్

**ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**



అమరావతి,ఆగస్టు 19,(జర్నలిస్ట్ వార్త): ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ మాజీ ఎండీ మధుసూదన్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. మధుసూదన్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ సోమవారం నాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫైబర్ నెట్ కార్పొరేషన్‌లో అవినీతిని కప్పి పుచ్చుకునేలా మధుసూధన్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని కూటమి సర్కార్ జీవోలో పేర్కొంది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని మధుసూదన్ రెడ్డి మీద అభియోగాలు నమోదు అయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులను ఉద్యోగుల నియామకం చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. అలాగే మధుసూదన్ రెడ్డి రికార్డులను ట్యాంపర్ చేస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. సాక్ష్యాలను ధ్వంసం చేస్తున్నారని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. మధుసూధన్ రెడ్డి కేంద్ర సర్వీస్ నిబంధనలను ఉల్లంఘించినట్టు పేర్కొన్న ప్రభుత్వం.. హెడ్ క్వార్టర్సు విడిచి వెళ్లకూడదని స్పష్టం చేస్తూ జీవో జారీ చేసింది. పలువురు ప్రైవేటు వ్యక్తులకు లబ్ది చేకూర్చేలా మధుసూదన్ రెడ్డి వ్యవహరించారంటూ ప్రభుత్వం జీవోలో పేర్కొంది. కాగా.. ÷బైర్ నెట్ కార్పోరేషనులో రూ. 800 కోట్ల మేర అవినీతి జరిగిందని ఏపీ సర్కార్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఫైబర్ నెట్‌లో జరిగిన అక్రమాలపై పూర్తి విచారణకు ఆదేశించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.




# ఆకాష్ పూరి పదునైన తల్వార్!

ఆకాష్ పూరి సినిమా చేసి రెండేళ్లు అవుతుంది. చోర్ బజార్ ఫ్లాప్ తర్వాత ఆకాష్ టాపిక్ ఇండస్ట్రీ లే వినిపించలేదు. ఇటీవల రిలీజ్ అయిన డాడ్ సినిమా డబుల్ ఇస్మార్ట్సైతం ఆశించిన ఫలితాలు సాధించడం లేదు. దీంతో పూరి అండ్ కో అంతా ఫ్లాప్ ల మయం అన్నట్లు హైలైట్ అవుతుంది. పూరి తదుపరి ఏ హీరోతో సినిమా చేస్తారు? అన్నది క్లారిటీ లేదు. ఓ సినిమా సెట్స్ లో ఉండగానే మరో సినిమా లాక్ చేసే పూరి ఇప్పుడు ఆ పరిస్థితుల్లో కనిపించలేదు. దీంతో కొన్ని గంటల క్రితమే అభిమానుల్ని సర్ ప్రైజ్ చేస్తానంటూ ఆకాష్ ఓ వీడియో రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఓ మంచి సినిమాకి సైన్ చేసినట్లు రివీల్ చేసాడు. తాజాగా నేడు ఆకాష్ పుట్టిన రోజు సందర్భంగా ఆ ప్రాజెక్ట్ వివరాలు అధికారికంగా వెల్లడించారు. అలాగే ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా పంచుకున్నారు. పోస్టర్ లో ఆకాష్ లుక్ అదిరిపోయింది. డ్యాషింగ్ డైరెక్టర్ సన్ అనిపించాడు. తల్వార్ లానే పదునుగా కనిపిస్తున్నాడు. ఆకాష్ షర్ట్ పై రక్తం , పవర్ ఫుల్ ఐస్ ఆకాష్ పాత్రని హైలైట్ చేస్తుంది. ఈ సినిమాకి తల్వార్ అనే టైటిల్నిర్ణయించారు. గెట్ రెడీ ఫర్ బ్లడ్ బాత్ అంటూ పవర్ ఫుల్ కొటేషన్ జనాల్లోకి వదిలారు. టైటిల్స్ కార్డ్స్ లో ఆకాష్ పేరు కూడా మారేలా కనిపిస్తోంది. పోస్టర్ లో ఆకాష్ జగన్నాధ్ ఇన్ అని వేసారు. జగన్నాధ్ తండ్రి పేరు. ఇప్పుడు కుమారుడు ఇంటి పేరుకి బధులు తండ్రి పేరు యాడ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాతో కాశీ పరశురాం అనే కొత్త కుర్రాడు దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈఎల్ వీ భాస్కర్ సమర్పిస్తున్నారు. స్టూడియోస్ వార్నిక్ సంస్థ నిర్మిస్తుంది. కేశవ్ కిరణ్ సంగీతం అందిస్తున్నాడు. త్రిలోక్ సిద్దు డివోపీగా పని చేస్తున్నాడు. సినిమా ప్రారంభోత్సవం ఎప్పుడు ఉంటుంది? రెగ్యులర్ షూటింగ్ ...రిలీజ్ తేదీలు వంటి వివరాలు త్వరలో తెలియనున్నాయి.



# నటసింహ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో మెగాస్టార్!

నటసింహ బాలకృష్ణ ఇండస్ట్రీకి వచ్చి 50 పూర్తయిన సందర్భంగా పరిశ్రమ తరుపున సెప్టెంబర్ 1న భారీ ఎత్తున గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్లు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇంతవరకూ ఏ నటుడి పేరిట ఇంత గ్రాండ్ గా వేడుకలు జరగలేదు. తొలిసారి నటసింహం పేరిట భారీ ఎత్తున దిక్కులు పిక్కటిల్లేలా వేడుకలు నిర్వహి స్తున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. దీనికి సంబంధించి ఇండస్ట్రీలో ఉన్న అన్నీ సంఘాలు ఒకేతాటిపైకి వచ్చి ఐక్యంగా ముందుకెళ్తున్నాయి. ఈవెంట్ కి ఇంకా పదిరోజుల సమయం ఉంది. దీనిలో భాగంగా ఆహ్వాన పత్రికలు పంపిణీ కార్యక్రమం మొదలైనట్లు తెలుస్తోంది. తాజాగా మెగాస్టార్ చిరంజీవి కి ఆహ్వాన పత్రిక అందింది. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, డైరెక్టర్స్ అసోసియేషన్, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రతినిధులు చిరంజీవిని కలిసి ఆహ్వానం పలికారు. భరత్ భూషణ్, దామోదర్ ప్రసాద్, ప్రసన్నకుమార్, రాజా రవీంద్ర, జెమినీ కిరణ్, కెఎల్ నారాయణ, మాదాల రవి, అనుపమ్ రెడ్డి, నిర్మాత సి కళ్యాణ్, దర్శకుడు వీర్ శంకర్, నిర్మాత అశోక్ కుమార్, అనిల్ వల్లభనేని చిరంజీవిని ఆయన నివాసంలో కలిశారు. అందరూ కలిసి చిరంజీవితో ఓ గ్రూప్ ఫోటో దిగారు. ఆ ఫోటో నెట్టింట వైరల్ అవుతుంది. ఇండస్ట్రీలో సంఘాలన్నీ ఇలా కలవడం అన్నది చాలా రేర్. బాలయ్య కారణంగా ఆ సన్నివేశం చోటు చేసుకుంది. ఇండస్ట్రీ పెద్దగా చిరంజీవిని అన్ని సంఘాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే చిరును స్వయంగా కలిసి ఆహ్వానించాలని నిర్ణయించి ముందుకెళ్లినట్లు తెలుస్తోంది. ఇంకా ఇండస్ట్రీలో మోహన్ బాబు, మురళీ మోహన్ లాంటి పెద్దలున్నారు. వాళ్లను కూడా స్వయంగా కలిసే అవకాశం ఉంది.



# థై స్లిట్ ఫ్రాక్‌లో యాంకర్ శ్రీముఖి

షోబిజ్‌లోని ప్రముఖ యాంకర్ కం నటీమణిగా శ్రీముఖి క్రేజ్ వేరు. అత్యుత్తమ యాంకర్లలో ఒకరిగా దశాబ్ధం పైగానే కొనసాగిన శ్రీముఖి పెద్ద తెరపైనా రాణిస్తున్నారు. తనదైన నటప్రతిభతో పాటు ఇండస్ట్రీలో రేర్ ఫ్యాషనిస్టాగాను గుర్తింపును పొందింది. టాప్ యాంకర్ శ్రీముఖి సోషల్ మీడియాల్లోను చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తన అభిమానులతో సన్నిహితంగా ఉండటానికి ఎప్పటికప్పుడు తాజా విహారయాత్రల నుండి ఫోటోలను తరచుగా షేర్ చేస్తుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి బాలాజీ ఆలయాన్ని సందర్శించి, తన విహారయాత్ర నుండి ఫోటోలను షేర్ చేయగా అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. మొన్నటికి మొన్న తన షూటింగ్ లొకేషన్ లో కారవ్యాన్ నుంచి శ్రీముఖి ఎక్స్ క్లూజివ్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో మంటలు పెట్టింది. %ఇంతలోనే ఇప్పుడు ఒక స్పెషల్ ఫోటోగ్రాఫ్ నెట్ లో అందరి దృష్టిని విపరీతంగా ఆకర్షించింది. ఇది ఇటీవలి కాలంలో డీసెంట్ అండ్ స్పెషల్ లుక్. శ్రీముఖి థై స్లిట్ ఫ్రాకులో సంథింగ్ స్పెషల్ గా కనిపించింది. అసభ్యతకు తావివ్వకుండా ఈ ఫోటోషూట్ లో శ్రీముఖి అభినయించిన తీరు ఆకర్షించింది. బంగారు వర్ణం ఫ్రాకు ధరించి ఆ పైన బ్లేజర్ తో అందాలను కవర్ చేసింది. ఇక శ్రీముఖి థిక్ మేకప్ లుక్ లో కనిపించింది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. శ్రీముఖి టెలివిజన్ హోస్ట్‌గా తన కెరీర్‌ని ప్రారంభించింది. జులాయి (2012)లో సహాయ పాత్రతో తన సినీ రంగ ప్రవేశం చేసింది. ఆ తర్వాత ప్రేమ ఇష్క్ కాదల్ (2013)లో కీలక పాత్రను పోషించింది. తెలుగు బుల్లితెరపై అత్యధిక పారితోషికం తీసుకునే యాంకర్లలో శ్రీముఖి ఒకరు. చివరిగా మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో భోలా శంకర్ చిత్రంలో శ్రీముఖి కనిపించింది. తదుపరి కొన్ని సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. మరోవైపు టీవీ కార్యక్రమాలతోనూ కెరీర్ పరంగా దూసుకెళుతున్న ఈ బ్యూటీ బాగానే ఆర్జిస్తోంది.



# ప్లానింగ్ లేకుండానే రకుల్ హీరోయిన్ ?

రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ కెళ్లి సక్సెస్ అయిన భామ. టాలీవుడ్ లో ఓ వెలుగు వెలిగిన తర్వాతే అమ్మడికి బాలీవుడ్ లో అవకాశాలు వరించాయి. ప్రస్తుతం అక్కడ వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. అయితే ఇలా సక్సెస్ అవ్వాలంటే ఏ నటికైనా ఓ ప్రణాళిక ఉంటుంది? దాని ప్రకారం ముందుకెళ్తూ భవిష్యత్ ని నిర్దేశించుకుంటారు. బ్యాక్ గ్రౌండ్ లేని భామల విషయంలో ఎలా ఉంటుందంటే? సినిమాల్లోకి రావాలంటే ముందుగా మోడలింగ్ చేయడం... చిన్న చిన్న యాడ్స్ చేయడం అక్కడ నుంచి యాడ్ ఏజెన్సీలకు వెళ్లడం... నచ్చితే సినిమాల్లో ఏ దర్శక, నిర్మాత అయినా అవకాశం ఇవ్వడం జరుగుతుంది. కానీ ఎలాంటి యాక్టింగ్ బ్యాక్ గ్రౌండ్ లేని రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్ మాత్రం తాను ఏమాత్రం గెస్ చేయని విధంగా సాగుతుంది. అమ్మడు మోడల్ కాదు. 'గిల్లి' అనే కన్నడ సినిమాలో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'కెరటం'తో తెలుగులో లాంచ్ అయింది. అటుపై తమిళ్ లో 'యువన్' అనే సినిమా చేసింది. ఇవేవి అమ్మడికి గుర్తింపు తీసుకు రాలేదు. కానీ తెలుగులో మాత్రం 'వెంకటాద్రి ఎక్స్ ప్రెస్' విజయంతో అమ్మడి స్టార్ మారిపోయింది. అక్కడ నుంచి వరుసగా స్టార్ హీరోల సరసన ఛాన్స్ అందుకుంది. అటుపై తమిళ్ లోనూ బిజీ అయింది. అక్కడ నుంచి హిందీలోనూ తిరుగులేని భామగా ఎదుగుతోంది. అయితే కెరీర్ ఇలా సంతోషంగా సాగిపో తుందని తానుఏ మాత్రం ఊహించలేదంటోంది. తనకు దక్కిన అవకాశాల విషయంలో అదృష్టం అనే పదం చాలా చిన్నదిగానే ఉంటుందంది. తక్కువ సమయంలోనే స్టార్ హీరోలతో కలిసి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావించింది. ఇలా జరుగుతుందని ఏనాడు కలగనలేదని....సినిమాల్లోకి రావడం..సక్సెస్ అవ్వడం అన్నీ దానంతట అదే జరిగిందని తెలిపింది.




# కంగువతో పోటీ పడనున్న వెట్టయాన్

ఇండియన్ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వెట్టయాన్'. తెలుగులో వేటగాడు అని వస్తున్న ఈ సినిమాకు జై భీమ్ ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ అగ్రనటుడు అమితాబ్ బచ్చన్, మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికా సింగ్, దుషారా విజయన్ ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ రిలీజ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీని మొదట 2024 దసరా కానుకగా విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే తేదీని మాత్రం అనౌన్స్ చేయలేదు. ఇప్పుడు తాజాగా తేదీని కూడా ఖరారు చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాను అక్టోబర్ 10న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. అయితే ఇదే రోజున కోలీవుడ్ నుంచి మరో పెద్ద సినిమా రాబోతుంది. తమిళ స్టార్ నటుడు సూర్య శివ కాంబోలో కంగువ అనే సినిమా వస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను అక్టోబర్ 10న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే ఇదే రోజున ఇప్పుడు రజినీకాంత్ వేటగాడు కూడా రాబోతుంది. దీంతో దసరా రోజు బిగ్ ÷ట్ జరుగనున్నట్లు తెలుస్తుంది.